# పంచాయతీల్లో పైసల్లేవ్

- ఐదు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలనలో జీపీలు
- కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి
- పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఉన్నతాధికారుల ఆదేశం
- ఏం చేయాలో తోచని స్థితిలో పంచాయతీ కార్యదర్శులు



ఇర్విన్ గ్రామ పంచాయతీ కార్యాలయం

**మాడ్గుల:** నిధుల లేమితో గ్రామ పంచాయతీలు కొట్టు మిట్టాడుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఐదు నెలలు అవుతోంది. అప్పటి నుంచి జీపీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసే నాటికి జీపీ ఖాతాల్లో సున్నా నిల్వలున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం నుంచి కొన్ని నెలలుగా నిధులు రావడం లేదు. ఎప్పుడు వస్తాయో కూడా స్పష్టత లేకపోవడంతో పాలనకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. జీపీల్లో నిధుల లేమితో సర్దుబాటుతో కాలం వెల్లదీస్తున్నట్లు కార్యదర్శులు చెబుతున్నారు. వానాకాలం ప్రారంభం దృష్ట్యా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని మరోవైపు జిల్లా అధికారులు ఆదేశిస్తున్నారు. దీంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి.

**వారి పాత్ర నామమాత్రమేనా..!**

ప్రత్యేక అధికారుల పాత్ర నామమాత్రమే అనే విమర్శలున్నాయి. పల్లె ప్రగతి పనులు చేపట్టాలంటే నిరంతరం నిధులు విడుదలైతేనే సాధ్యమౌతుంది. నెలవారీ పారిశుద్ధ్య కార్మికుల వేతనాల చెల్లింపులు లేక చాలచోట్ల వారు పనులు మానుకుంటున్నారు. రక్షిత మంచినీటి పథకం, వీధి దీపాలు, ట్రాక్టర్ల వాయిదాలు, విద్యుత్ బిల్లులు.. ఇలా కొన్నిటికి సంబంధించి ప్రతినెలా ఖచ్చితంగా చెల్లించాలిందే. పెద్ద పంచాయితీల్లో పన్నుల వసూళ్లతో నెట్టుకొస్తున్నప్పటికీ చిన్న పంచాయతీల్లో ఆదాయ వనరులు కొరవడి తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

**సొంత డబ్బుతో అభివృద్ధి పనులు చేపట్టా**



సర్పంచ్‌గా ఉన్నంతకాలం సొంత డబ్బు తీసుకువచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాం. ఇప్పటికీ నేను చేపట్టిన పనులకు బిల్లులు రాలేదు. అయినా ప్రజాసేవలో ఏ రోజూ వెనుకడుగు వేయలేదు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు.

– రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్, నాగిళ్ల

## క్లుప్తంగా

### యాచారం ఎంపీఓగా శ్రీలత

**యాచారం:** మండల పంచాయతీ అధికారి ఉమారాణి ఆమనగల్లు మండలానికి బదిలీ అయ్యారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎంపీఓ శ్రీలత యాచారానికి బదిలీపై వచ్చారు. కాగా శ్రీలత గతంలో యాచారంలో మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీలత సోమవారం యాచారంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు.

### ఆర్థికసాయం అందజేత


రాములు కుటుంబ సభ్యులకు నగదు అందజేసిన నాయకులు

**ఆమనగల్లు:** మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన కొప్పుల రాములు (46) ఆదివారం గుండెపోటుతో మరణించాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని సోమవారం గౌడ సంక్షేమ సంఘం కల్వకుర్తి అధ్యక్షుడు అల్లాజీగౌడ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు నర్సింహగౌడ్, ఇర్విన్ మాజీ సర్పంచ్ యాదయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్యగౌడ్ పరామర్శించారు. మృతుడి కుటుంబానికి కల్వకుర్తి గౌడ సంక్షేమ సంఘం తరపున రూ.5 వేలు, గ్రామ గౌడ సంఘం తరపున రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. గౌడసంఘం నాయకులు నిరంజన్‌గౌడ్, అరవింద్ గౌడ్, ఎల్లయ్యగౌడ్, దళపతిగౌడ్, శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, మల్లేశ్, చంద్రశేఖర్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

### సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

**తుర్కయంజాల్:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని సర్వే నంబర్లు 18, 19లోని శ్రీ సాయినగర్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరుతూ సోమవారం ఆ కాలనీవాసులు మున్సిపల్ చైర్పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిలర్ మాధవికు వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, అంతర్గత డ్రైనేజీ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు రామకృష్ణ, కాలనీవాసులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### మల్లురవికి మద్దతుగా..

ఢిల్లీకి తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు




**ఆమనగల్లు:** మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం ఢిల్లీ తరలి వెళ్లారు. ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవి ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆయనకు అభినందనలు తెలపడానికి నాయకులు ఢిల్లీకి తరలివెళ్లారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, సీనియర్ నాయకులు కేశవులు, రవీందర్‌నాయక్,రాములు, మల్లేశ్, మల్లయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్ హయాంలోనే 'కేజీబీవీ' నిర్మాణంలో జాప్యం

కాంగ్రెస్ నేత రాంచందర్‌నాయక్

**కడ్తాల్:** గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల నిర్మాణంలో జాప్యం జరిగిందని మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత పది సంవత్సరాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమస్య పరిష్కారానికి కృషి చేయని జెడ్పీటీసీ, మరో వారం–పదిరోజుల్లో పదవీకాలం ముగియనుండటంతో రాజీనామా పేరుతో డ్రామాలాడటం తగదని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేసి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు అద్దె భవనాలు, అధికారం కోల్పోయాక అభియోగాలు చేయడం జెడ్పీటీసీకి తగదని సూచించారు. అధకారంలో ఉన్నప్పుడు కేజీబీవీ భవన నిర్మాణం విషయంలో శ్రద్ధ ఎందుకు చూపలేదో తెలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు శ్రీను, ఇమ్రాన్‌బాబా, విజయ్‌రాథోడ్, బోసురవి, రమేష్, మహేశ్ తదితరులు ఉన్నారు.

## ఆదిబట్లను అగ్రగామిగా నిలుపుతా

- మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఆదిబట్లను మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో కౌన్సిలర్ మౌనిక ఆధ్వర్యంలో రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను మంగళవారం చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణం చేసే స్థలాన్ని పరిశీలించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. దశల వారిగా మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామన్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కొత్తగా ఏర్పాటు అవుతున్న కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అయిలయ్య, కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, ఏఈ వీరాంజనేయులు, భవానీ దేవదాస్, నర్సింహ, దానయ్య, అశోక్, రమేష్, శ్రీనివాస్, జంగయ్య, వెంకటయ్య, జగన్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు కేటాయించండి

- కలెక్టర్‌కు లబ్ధిదారుల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** కర్మన్‌ఘాట్ నందనవనం జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఇదివరకు రాష్ట్ర ప్రభుత్వం నందనవనంలో నిర్మించి అందజేసిన జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో 275 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేస్తే వాటిలో కొంతమంది.. రాజకీయ నాయకులు అండతో కబ్జా చేశారని వాపోయారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో మాపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. గిరిజన, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలకు అందజేసిన ఫ్లాట్లు న్యాయబద్ధంగా వారికే కేటాయించాలని కోరారు. వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు లబ్ధిదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రాథోడ్, రాజ్‌కుమార్, శీలనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనాయుడు, గుణసుందరి, సీతాదేవి, మాధవి పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాను అరికడదాం

- ప్రజ్వల సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామ కృష్ణ
- మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బలరామకృష్ణ

**తలకొండపల్లి:** మానవ అక్రమ రవాణా అరికట్టడంలో అందరూ కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరముందని ప్రజ్వల సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామ కృష్ణ అన్నారు. హైదరాబాద్ ప్రజ్వల సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూళన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏపీఎం శ్రీదేవి సౌజన్యంతో సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మానవ అక్రమ రవాణా అనే అంశంపై.. పొదుపు సంఘం మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బలరామ కృష్ణ, శ్రీదేవి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం 28 సంవత్సరాలుగా ప్రజ్వలన సంస్థ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. లైగింక వ్యాపారానికి వ్యతిరేకంగా పని చేస్తున్న 28,500 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సునీత కృష్ణన్ ఆడ పిల్లల రక్షణ నిమిత్తం, మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక ప్రోత్సాహిక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మానవ అక్రమ రవాణా రకాలు, సైబర్ ట్రాఫికింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఏలాంటి మోసాలు జరుగుతున్నాయో, తదితర అంశాలపై చర్చించి అర్థమగు రీతిలో చక్కగా వివరించి అవగాహన కల్పించారు. లఘు చిత్రాలు, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, గ్రూప్ డిస్కస్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఏపీఎం శ్రీదేవి, సీసీలు లక్ష్మయ్య, రామయ్య, సుధారాణి, చెన్నయ్య, ప్రజ్వలన సిబ్బంది సురేష్ కుమార్, అనిల్, అంబర్ సింగ్, మిథాళి రాజ్, అనిల కుమార్, వీఓఏలు నరసింహ, కల్పన, బాగ్యలక్ష్మీ, స్వప్న, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### వరిసాగుపై రైతులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త దామోదరరాజు

**ఆమనగల్లు:** మండల పరిధిలోని రాంనుంతలలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు.. రైతులకు వరిపంట సాగుపై అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్ష, పంటసాగు, ఎరువుల వాడకం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు దామోదరరాజు, పవన్ చంద్రారెడ్డి.. రైతులకు వివరించారు. రాంనుంతల గ్రామాన్ని దత్తత తీసుకుని రాబోయే మూడు సంవత్సరాల వరకు రైతులు చేసే పంటసాగుకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామని వారు వివరించారు. రైతులు అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు సందేహాలను వారు నివృత్తి చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరారు. ఆధునిక పద్ధతిలో సాగు చేపట్టడంతో పాటు సేంద్రియ ఎరువుల వాడకంతో దిగుబడి పెరిగి లాభాలు గడించవచ్చన్నారు. ఎవైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ ఆదిలక్ష్మి, వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈఓలు శివతేజ, మీనాక్షి, రైతులు సత్తయ్య, నర్సింహ, యాదయ్య, నారయ్య తదితరులు పాల్గొన్నారు.

## అదనపు టీచర్లను తిప్పి పంపాలి


ఇబ్రహీంపట్నం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు


ఆమనగల్లు: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

- నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయ సంఘాల నిరసన

**ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లాకు అదనంగా ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులతో ఈ జిల్లా ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతోందని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు సోమవారం హాజరైన ఉపాధ్యాయులు సాయంత్రం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతరెడ్డికి ఈ అంశంపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐక్యవేదిక నాయకలు పరమేష్, దామోదర్, తిరుమలేశ్, రామకృష్ణ మాట్లాడుతూ.. జీఓ 317 ప్రకారం నూతన జిల్లాలకు వివిధ కారణాలతో ఇతర జిల్లాలకు చెందిన కేడర్ స్ట్రెంత్‌ను మించి వచ్చినట్లు తెలిపారు. దీంతో రంగారెడ్డి జిల్లాలోని స్థానిక ఉపాధ్యాయులకు బదిలీల్లో, పదోన్నతుల్లో తీవ్ర నష్టం కలిగిందని, అంతేగాకుండా స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలకు గండి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన డాటా వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉందన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు, నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ ఐక్యవేదిక నేతలు రాజు, మహేశ్, కిరణ్, మహేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, గోవర్ధన్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుల నిరసన**

**ఆమనగల్లు:** జిల్లాలో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు ఆమనగల్లు మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

**పీఆర్టీయూ ఆధ్వర్యంలో..**

**ఇబ్రహీంపట్నం రూరల్:** జిల్లాకు వచ్చిన అదనపు కేడర్‌ను వారివారి జిల్లాలకు పంపించి రంగారెడ్డి జిల్లాలో కూడా ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీలో ఉన్న ఉపాధ్యాయులు సోమవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పీఆర్టీయూ అధ్యక్షుడు పరమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నల్ల బ్యాడ్జీలతో నిరసన..**

**యాచారం:** రాష్ట్రంలోని అన్ని జిల్లాల మాదిరిగానే రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లాబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల అందజేత


యాచారం: పుస్తకాలు అందజేస్తున్న జయశ్రీ, నర్సిరెడ్డి దంపతులు

**యాచారం:** మండల పరిధిలోని గునుగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం అదే గ్రామానికి చెందిన తోటిరెడ్డి జయశ్రీ , నర్సిరెడ్డి దంపతులు నోటు పుస్తకాలను అందజేశారు. 86 మంది విద్యార్థులకు రూ.15వేల విలువ జేసే 600 నోట్ పుస్తకాలను అందజేశారు. గతంలో జయశ్రీ, నర్సిరెడ్డి దంపతులు ఈ పాఠశాలకు జారుడుబల్ల, బ్యాలెన్సింగ్, ఊయల తదితర క్రీడా సామగ్రిని అందజేశారు. తాజాగా నోట్ పుస్తకాలను అందజేయడం పట్ల పాఠశాల హెచ్ఎం జంగయ్య వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు.. ప్రేమాకర్‌రెడ్డి, కర్నాకర్‌రెడ్డి, విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం రూరల్: చిన్నారులతో దాతలు, ఉపాధ్యాయులు

**అండగా నిలవాలి..**

**ఇబ్రహీంపట్నం రూరల్:** ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పోల్కంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు కోరారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బొడ్డు బాల్‌రెడ్డి కుమార్తె.. పాల్‌టెక్ కంపెనీ నుంచి నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రిని సోమవారం పోల్కంపల్లి పాఠశాల విద్యార్థులకు అందించారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశికళ, కృష్ణ, కిరణ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ప్రవేశాలు

- యాచారంలో ప్రైవేట్ పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ నేతల ధర్నా

**యాచారం:** నింబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా యాచారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలను వెంటనే మూసివేయడంతో పాటు ఆ పాఠశాల యజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ మండల కేంద్రంలో సదరు పాఠశాల భవనం ఎదుట సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సదరు ప్రైవేట్ పాఠశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని, అయినా పాఠశాల యజమాన్యం గత రెండు నెలల నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తోందని.. రూ.వేలాది ఫీజులు వసూల్ చేస్తుందని అన్నారు. అడ్మిషన్లు, పాఠ్యపుస్తకాల పేరుతో దోపిడీకి పాల్పడుతన్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. ఎస్ఎఫ్ఐ శ్రేణులను సముదాయించే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి స్పందించి.. కార్యాలయ సిబ్బంది ద్వారా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సదరు పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని.. తల్లితండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించవద్దని పాఠశాల గోడకు నోటీసును అంటించారు. దీంతో ఎస్ఎఫ్ఐ నాయకులు తమ ధర్నాను విరమించారు. అనుమతులు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌ను నాశనం చేయవద్దని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్, ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, తరంగ్, ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్, నాయకులు.. శ్రీకాంత్, లిఖిత్‌కుమార్, రాకేష్, శివ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## 'మాఫీ' ప్రకటన హర్షణీయం

- కాంగ్రెస్ నేతల సంబురాలు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


తలకొండపల్లి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**తలకొండపల్లి:** ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు.. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు రవీందర్ యాదవ్, అంజయ్య గుప్తా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెన్నకేశవులు, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, ఎంపీటీసీ అంబాజీ, యాదగిరి, ప్రదీప్‌రెడ్డి, ఆరీఫ్, అజీమ్, యాదయ్య, కృష్ణ, శ్రీశైలం, శేఖర్, డేవిడ్, రాజు, వెంకటయ్య, రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

**కేబినేట్ నిర్ణయంపై హర్షం..**

**కడ్తాల్:** ఆగస్టు 15లోపు రైతులకు సంబంధించి రూ.2 లక్షల పంటరుణాల మాఫీకి సంబంధించి కేబినేట్ ఆమోదముద్ర వేయడం పట్ల పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, బీక్యానాయక్, భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌బాబా, బీచ్యానాయక్, వెంకటేశ్, రాంచందర్, జహంగీర్ అలీ, మల్లేశ్‌గౌడ్, హీరాసింగ్, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

**ఆమనగల్లు పట్టణంలో..**

**ఆమనగల్లు:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల అధ్యక్షుడు జగన్ అన్నారు. ఆమనగల్లు పట్టణం రాజీవ్ చౌరస్తా వద్ద సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖలీల్, ధనుంజయ, కృష్ణనాయక్, ఖాదర్, అలీం, నాజర్, ఎంగలి ప్రసాద్, వెంకటేశ్, మైసయ్య, కరీం, శేఖర్‌గౌడ్, రఫీ, మహేశ్, సురేశ్, రామకృష్ణ, శ్రీను, జలాల్, ఫిరోజ్, కుమార్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రహీం, శ్రీనునాయక్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

**మాట నిలబెట్టుకుంటాం..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయనుందని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం బయలుదేరిన ఆయనకు ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిను నాయకులు సత్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన కోరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, నాయకులు ఖలీల్, కృష్ణనాయక్, ధనుంజయ, ఖాదర్, ప్రసాద్, అలీం, నాజర్, కరీం, మైసయ్య, విజయ్, మహేశ్, సురేశ్ తదితరులు ఉన్నారు.


కడ్తాల్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు